ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే..

- మెగా పీపుల్స్ సర్వేలో వెల్లడి
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన మెగా పీపుల్స్ సర్వే 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం విజయవంతం అయినందుకు చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కోటి 60 లక్షల కుటుంబాలు ఉండగా.. అందులో కోటి 45 లక్షల కుటుంబాలను కలిసి మాట్లాడటం జరిగిందని, వారంతా జగనన్నకు మద్దతిస్తున్నట్లు చెప్పారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేశామని, రైతులు, మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఇలా అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలంతా పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమ ప్రాధాన్యతతో ముందుకు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. టీడీపీ నేతలు సెల్ఫీలతో ప్రజలను మభ్యపెట్టడం మొదలు పెట్టారని, వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడే అర్హత టీడీపీ నేతలకు లేదన్నారు. రానున్న ఎన్నికల్లో గజపతినగరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా మరోసారి ఎగురవేయడం జరుగుతుందని ఎమ్మెల్యే దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, జేసీఎస్ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, సామంతుల పైడిరాజు, గేదెల ఈశ్వరరావు, లెంక గణేష్, బి.రాంబాబు, పి.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని ముద్దూరు గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా, అవినీతికి అవకాశం లేనివిధంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, మాజీ ఎంపీపీ బండారు బంగారం, పార్టీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, నాయకులు మీసాల తులసీరాం, బోద్దల చిన్నంనాయుడు, గొట్లాం, రాచకిండాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్లు మహంతి రమణ, గొల్లు సతీష్, సర్పంచ్ మునకాల పైడిపునాయుడు, ఎంపీటీసీ సుంకరి కృష్ణవేణి పాల్గొన్నారు.

అందరి నమ్మకం జగన్



'జగనన్నే మా భవిష్యత్' సర్వే పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

- నియోజకవర్గంలో 78వేల కుటుంబాల మద్దతు
- మెగా పీపుల్స్ సర్వేకు అద్భుత స్పందన
- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ప్రభుత్వ పనితీరుపై చేపట్టిన సర్వేలో నియోజకవర్గంలోని 78 వేల కుటుంబాలు జగనన్న పాలనకు మద్దతు తెలిపాయని, ప్రజలంతా 'మా నమ్మకం జగన్' అంటూ మద్దతు ప్రకటించారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని అర్థన్నపాలెం సమీపంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకువెళ్లిన పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జనం నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగగా నియోజకవర్గంలో ఇప్పటివరకు 185 రోజుల పాటు 46,500 కుటుంబాలను కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, గిరిజన్ కార్పొరేషన్ చైర్మన్ శోభాస్వాతీరాణి మాట్లాడుతూ.. నవరత్న పథకాలతో పేదల ఇంట సంక్షేమ వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతిస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో నాలుగేళ్లలో సంక్షేమ పథకాల కింద రూ.225.30 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, మార్కెటింగ్ చైర్మన్ మూకల కస్తూరీ, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మెరపల సత్యనారయణ, కొత్తవలస, వేపాడ, ఎల్.కోట, జామి మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి' ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏపీఓ రత్నకుమారి ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనుల సోషల్ ఆడిట్‌పై శనివారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2021 ఏప్రిల్–1 నుంచి 2022 మార్చి నెలాఖరు వరకు చేపట్టిన పనులకు సంబంధించి రూ.24 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఏయే పనులకు ఎంత మొత్తంలో నిధులు ఖర్చు చేశారో వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు సొంతూరులోనే జీవనోపాధి లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఏపీడీలు శారదాదేవి, లక్ష్మణరావు, విజిలెన్స్ అధికారి రవీంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం..



క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కొత్తవలస: మండలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు నెక్కలి శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఆర్.సన్యాసిరావు మాట్లాడుతూ.. మండలంలోని 25 పంచాయతీల పరిధిలో పాడైన బోర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. రూ.4 లక్షలతో బోర్లు మరమ్మతులకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.పద్మజ పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



గజపతినగరం: పోలీస్‌లు, న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి కనకలక్ష్మి



శృంగవరపుకోట: పోలీసులు, న్యాయవాదులకు సూచనలు చేస్తున్న జడ్జి ఎస్.వాణి

శృంగవరపుకోట: మే నెల 13న నిర్వహించే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.వాణి కోరారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సివిల్, చెక్‌బౌన్స్, మనోవర్తి కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ అయ్యేలా చూడాలని ఆమె కోరారు.

గజపతినగరం: మండల కేంద్రంలోని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో మే 13న జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి కనకలక్ష్మి తెలిపారు. లోక్‌అదాలత్ నిర్వహణపై శనివారం స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో సమావేశమై పలు సూచనలు చేశారు. మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

గజపతినగరం: ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మే నెల 1 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చీపురుపల్లి: ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 20 వరకు ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

దొంగల భయం

దత్తిరాజేరు: మండల కేంద్రమైన దత్తిరాజేరు బీసీ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు దొంగలు హల్‌చల్ చేసినట్లు గ్రామపెద్ద మజ్జి అప్పలనాయుడు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన యువకులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. వారిలో ఇద్దరు పారిపోయారని, ఒకరిని పట్టుకుని పెదమానాపురం పోలీస్‌లకు అప్పగించామని అన్నారు. ఈ విషయాన్ని ఎస్సై శిరీష వద్ద ప్రస్తావించగా అనుమానితుడిగా వివరాలు నమోదు చేసుకొని విడిచి పెట్టినట్లు చెప్పారు.

యోగా శిక్షణ

శృంగవరపుకోట: పట్టణంలోని మోక్షవిద్య యోగమందిర్ ఆధ్వర్యంలో మే నెల 1 నుంచి జూన్ 10వ తేదీ వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక అమర్ కౌముది పాఠశాలలో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. 41 రోజుల పాటు చేపట్టే ఈ శిక్షణలో వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99893 68781 సంప్రదించాలని కోరారు.

బీజేపీ విధానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వైవీ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

చీపురుపల్లి రూరల్(గరివిడి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వైవీ వెంకటేశ్వరరావు అన్నారు. గరివిడి రైతుబజారులో శనివారం నిర్వహించిన ప్రచారభేరి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు చూస్తోందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, నిత్యావసర ధరలపై వామపక్షాలు చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, టీవీ రమణ, అంబల్ల గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతుల మంజూరుకు ప్రజాభిప్రాయ సేకరణ



కొలికిపాలెంలో ప్రజాభిప్రాయసేకరణ చేస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు

వేపాడ: మండలంలోని సోంపురం, వీలుపర్తి పంచాయతీల్లో క్వారీలు, క్రషర్ల నిర్వహణ అనుమతులపై శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుదర్శన్ ఆధ్వర్యంలో డీఆర్‌ఓ గణపతిరావు సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సోంపురం పంచాయతీలో సర్వే నెం.07లో 1.41 హెక్టార్లు సాలీనా రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ 52.351 క్యూబిక్ మీటర్లు తవ్వకానికి మెసర్స్ కె.రమణమూర్తి, సోంపురంలో మెస్సర్స్ జి.సీతారాంకు సంబంధించి సర్వే నెం .07లో 1.540 హెక్టార్లులో రోడ్డుమెటల్, 41.361 క్యూబిక్ మీటర్లు బిల్డింగ్ స్టోన్స్ తవ్వకాలకు అనుమతిపై ఎవరికైనా, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. అలాగే వీలుపర్తి పంచాయతీలో కొలికిపాలెంలో మెసర్స్ దివ్యాంజనేయ స్టోన్ క్రషర్‌కు సర్వే నెం.45లో 5.993 హెక్టార్లులో రోడ్డుమెటల్, 76.869 క్యూబిక్ మీటర్లు బిల్డింగ్ స్టోన్ తవ్వకాలకు ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా కొలికిపాలెం గ్రామస్తులు గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని, కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. అప్పుడే క్వారీల నిర్వహణకు అనుమతులు మంజూరు చేయాలని అధికారులతో అన్నారు. దీనిపై డీఆర్‌ఓ స్పందిస్తూ.. గ్రామస్తుల అభిప్రాయాలపై క్వారీ యాజమాన్యాలు, గ్రామ పెద్దలతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషిచేయాలని తహసీల్దారు కృష్ణంరాజుకు సూచించారు.

ఇంటర్ ఫలితాల్లో గాయత్రీ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఎరుకునాయుడు

బొండపల్లి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో గొట్లాం శ్రీగాయత్రీ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో 91 శాతం, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ జి.ఎరుకునాయుడు, బి.జగదీశ్వరి, ఏఓ జి.రాఘవ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సీహెచ్.అశోక్ 986 మార్కులు, బైపీసీలో జె.యమున 976 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎం.లహరి 459 మార్కులు, బైపీసీలో ఎస్.మానస 431 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

నెల రోజుల్లో పట్టాలు వచ్చేలా చూస్తాం..



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు, తహసీల్దారు కృష్ణంరాజు

- డీఆర్వో గణపతిరాజు

వేపాడ: కొండగంగుబూడి రెవెన్యూలో గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలిస్తామని డీఆర్‌ఓ గణపతిరావు హామీ ఇవ్వటంతో ఆందోళన విరమిస్తున్నట్లు ఏపీ రైతుసంఘం జిల్లా నాయకుడు చల్లా జగన్ ప్రకటించారు. కొండగంగుబూడి పంచాయతీలో 9 గ్రామాలకు చెందిన 160 మంది గిరిజనులు 276 ఎకరాల్లో సాగుచేస్తున్నట్లు సర్వేలో అధికారులు గుర్తించారు. వారికి పట్టాలు మంజూరు చేయడంలో జాప్యం చేస్తుండటంపై వారంతా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. నెల రోజుల్లో పట్టాలు వచ్చేలా చూస్తామని డీఆర్వో గణపతిరావు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్



వేపాడ: జగనన్న లేఅవుట్‌లో శ్లాబ్ నిర్మాణం పూర్తయిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారుల బృందం



చీపురుపల్లి: ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్



బొండపల్లి: ముద్దురూలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, తదితరులు

చీపురుపల్లి: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి కె.రాజ్‌కుమార్ లబ్ధిదారులను కోరారు. పట్టణంలోని మెట్టకాలనీ వద్ద ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. మంజూరైన ఇళ్లు, నిర్మాణాలు ప్రారంభమైనవి, నిర్మాణాలు పూర్తయిన వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నిర్మాణ పనులు చేపట్టనివారు వెంటనే పనులు ప్రారంభించాలని, లేదంటే వాటిని రద్దు చేసి అర్హత ఉన్న వేరొకరికి కేటాయించడం జరుగుతుందన్నారు. హౌసింగ్, సచివాలయ సిబ్బంది నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, హౌసింగ్ ఏఈ బి.సూర్యనారాయణ ఉన్నారు.

ముద్దూరులో..

బొండపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్ అన్నారు. ముద్దూరు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గ్రామంలో 47 మందికి ఇళ్లు మంజూరు కాగా, 29 నిర్మాణాలు పూర్తయినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, హౌసింగ్ ఏఈఈ రమణరాజు, పీఆర్ జేఈ ఇ.కృష్ణమూర్తి, ఏపీఓ కృష్ణవేణి, వెలుగు ఏపీఎం సులోచనాదేవి, ఈఓపీఆర్డీ సుగుణకరరావు, సర్పంచ్ మునకాల పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని ఈఓపీఆర్డీ సీహెచ్ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు లబ్ధిదారులను కోరారు. వేపాడలోని జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన వారికి వెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ఆలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి నివారణకు 'క్రాస్‌ప్రోగ్రాం'



క్రాస్‌ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ఎంపీపీ కృష్ణవేణి, నాయకులు

మెరకముడిదాం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో క్రాస్ ప్రోగ్రాంను ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి జెండా ఊపి ప్రారంభించారు. గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను బాగు చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు క్రాస్ ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పార్వతి, ఎంఈఓ పి.రామరావు, ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు, బోరు మెకానిక్ పాల్గొన్నారు.

38 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లి రూరల్: మండలంలోని రావివలస గ్రామంలో మానవీయతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గరివిడి లైన్స్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 38 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 15 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయడంతో పాటు కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మణికంఠ, కొమ్ము చిరంజీవి, సూరు కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చీపురుపల్లిరూరల్: మండలంలోని బెవరపేట గ్రామంలో ఇటీవల జరిగిన కొట్లాటలో గాయపడిన జనసేన కార్యకర్తలను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల మనోహర్ శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు 50 వేలు పరిహారం అందజేశారు. వివాదంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఎస్పీ ఎం.దీపికకు విజ్ఞప్తిచేశామన్నారు. పార్టీనాయకులు పాలవలస యశస్విని, బీజేపీ నాయకుడు గద్దే బాబూరావు కూడా బాధితులను పరామర్శించారు.

పేదల సీఎం జగన్



గొల్లలవలసలో ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పాలనను వివరిస్తున్న సర్పంచ్ గోవింద్, తదితరులు

మెరకముడిదాం: పేదల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గొల్లలవలస సర్పంచ్ గోవింద్ అన్నారు. గొల్లలవలస, రాచపేట, పైలపేట, మిరాశిపేట తదితర గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధు, అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం రేపు

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి పంచాయతీ మధురగ్రామమైన సింగవరంలో వెలసిన కాశీవిశాలక్ష్మి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో మే నెల 1న స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త కోట్ల కృష్ణమూర్తినాయుడు శనివారం తెలిపారు. అలాగే అదేరోజు వేపచెట్టు, రావిచెట్టు కల్యాణం, నాగబంధం ప్రతిష్ఠ, రుద్రహోమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరం

జామి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మే నెల 1 నుంచి యోగా, మెడిటేషన్, వివిధ గేమ్స్‌కు సంబంధించి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓ జయశ్రీ, హెచ్‌ఎం రెహమాన్ తెలిపారు. మే 30వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. జామి జెడ్పీహెచ్‌ఎస్ పీడీ చంద్రశేఖర్, యోగా టీచర్ శంకర్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 63021 54839, 80086 51174 నంబర్లలో సంప్రదించాలని కోరారు.